సాక్షి ప్రకాశం

సోమవారం । 14 । ఆగస్టు । 2023



సమస్యల పరిష్కారమే లక్ష్యంగా..

ప్రజా సమస్యల పరిష్కారం..అభివృద్ధే ధ్యేయంగా మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 200 రోజుకు చేరింది. - 8లో..



ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యమని ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. కంభం మండలం జంగంగుంటలో 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఆయన పాల్గొన్నారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
36/29

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

న్యూస్‌రీల్

నేడు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు: ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి సోమవారం సాయంత్రం 5 గంటలకు ఒంగోలులోని తన కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారని ఎంపీ కార్యాలయ మేనేజర్ భవనం సుబ్బారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 8గంటలకు ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగే స్వాతంత్ర దినోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. 8.30 గంటలకు రంగారాయుడు చెరువుకట్టపై నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని జాతీయ జెండా ఎగురవేస్తారు. 9.30 గంటలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగే 77వ స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. 10 గంటలకు మిలిటరీ క్యాంటీన్ వద్ద మాజీ సైనికులు నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు.

20న విశ్వబ్రాహ్మణ ఆత్మీయ సమావేశం

ఒంగోలు: ఈనెల 20న స్థానిక విశ్వబ్రాహ్మణ కళ్యాణ మండపంలో విశ్వబ్రాహ్మణ ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు కళ్యాణ మండపం అధ్యక్షుడు చోడ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పేద వితంతు విశ్వ బ్రాహ్మణ మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ చేస్తారన్నారు. చేతివృత్తిదారులకు ఆర్టిజన్ సెల్ కార్డులు ఇవ్వడం గురించి చర్చించడంతో పాటు పలు సమస్యలపై చర్చిస్తారన్నారు.

కేంద్ర సంకల్పానికి అనుగుణంగా పన్నులు



సదస్సులో ఆళ్లను సత్కరిస్తున్న వేదిక నాయకులు

ఒంగోలు టౌన్: భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలబట్టే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పన్నుల విధానాన్ని అమలు చేస్తోందని సుపరిపాలనా వేదిక అధ్యక్షుడు మాగులూరి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక శుభప్రదం హాలులో నిర్వహించిన ఆదాయ పన్నులపై అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. దేశంలోని ఎక్కువ మంది ప్రజలను పన్నుల పరిధిలోకి తీసుకొని రావాలన్న సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ఉందని తెలిపారు. ప్రత్యక్ష పరోక్ష, పన్నులు, జీఎస్టీ గురించి రిటైర్డ్ ప్రిన్సిపాల్ సీవీఎల్ సుబ్రహ్మణ్యం వివరించారు. సీనియర్ సిటిజన్స్, పెన్షనర్లకు సంబంధించి ఇన్‌ట్యాక్స్ విధానంపై చార్టర్డ్ అకౌంటెంట్ సి.రాజేష్ సోదాహరణలతో సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం వేదిక పూర్వ అధ్యక్షుడు ఆళ్ల వెంకటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టి.గోపాల్‌రెడ్డి, సుంకర సాయిబాబా, చిట్టెం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇంతి.. ఇంతింతై...

రాష్ట్రం ప్రభుత్వం నాలుగేళ్లుగా ఇస్తున్న చేయూతతో మహిళలు ప్రగతి పథంలో దూసుకుపోతున్నారు. విద్య, వ్యాపారం, పారిశ్రామికం..ఇలా అన్ని రంగాల్లో తమదైన ముద్ర వేసుకుంటున్నారు. ఏ కీలక పదవుల్లో చూసినా మహిళల మార్క్ కనపడుతోంది. జిల్లాలో ప్రథమ పౌరురాలు మొదలు పోలీస్ బాస్, ఒంగోలు నగర ప్రథమ పౌరురాలు, ఒడా, ఆర్టీసీ రీజినల్ చైర్మన్ ఇలా అన్నీ కీలక పదవుల్లోనూ మహిళలే తమ శక్తిని చాటుకుంటున్నారు. మిగతా రంగాల్లోనూ రాణిస్తూ సాధికారత దిశగా అడుగులు ముందుకు వేస్తున్నారు. నేడు జాతీయ మహిళా సాధికారత దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కథనం.



- సాధికారత మెండుగా
- స్వయం సమృద్ధి దిశగా మహిళామణులు
- రాజకీయంగా, అధికార పదవుల్లోనూ ఆమే టాప్
- 50 శాతానికి పైగా పదవుల్లో అందలం
- జిల్లా, ఒంగోలు నగర ప్రథమ పౌరులిద్దరూ మహిళలే
- ఎస్పీగా మహిళను నియమించిన వైనం
- అన్ని సంక్షేమ పథకాలు మహిళలకే నేరుగా డీబీటీ ద్వారా అందజేత

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తోంది. జిల్లాలో గ్రామ పంచాయతీలు మొదలు అత్యున్నత పదవుల వరకు మహిళలకు అగ్రతాంబూలం ఇచ్చారు. పంచాయతీ పదవుల్లో 11 వేలు సర్పంచ్, వార్డు సభ్యుల పదవులుంటే అందులో దాదాపు 60 శాతానికి పైగా మహిళలకే దక్కాయి. జిల్లా, మండల పరిషత్‌ల్లోనూ ఆమెదే పై చేయి. ఇదిలా ఉంటే నామినేటెడ్ పదవుల్లో కూడా మహిళలకే ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చింది. ఇక అధికారుల్లోనూ జిల్లా స్థాయి పదవుల్లో కీలక భూమిక పోషిస్తున్నారు. అక్కచెల్లెమ్మలపై తనకున్న మమకారాన్ని మాటల్లోనే కాకుండా చేతల్లోనూ చేసి చూపిస్తున్నారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.

ప్రథమ మహిళ

జిల్లాలో ప్రథమ మహిళగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకు అవకాశమిచ్చి మహిళలకు నంబర్‌వన్ స్థానాన్ని కల్పించారు. అదేవిధంగా ఒంగోలు నగర ప్రథమ మహిళగా మేయర్ గంగాడ సుజాతను అందలం ఎక్కించి గౌరవించారు. అంతకంటే గొప్పగా లా అండ్ ఆర్డర్‌ను పరిరక్షించే బాధ్యతను ఎస్పీ మలికాగర్గ్‌కు అప్పగించారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్లుగా ఇరువురు మహిళలకే కేటాయించారు. ఒకరు సింగరాయకొండ జెడ్పీటీసీ సభ్యురాలు ఎన్నాబత్తిన అరుణ కాగా రెండో మహిళ మార్టూరు జెడ్పీటీసీ సభ్యురాలు చుండి సుజ్ఞానమ్మ. ఆర్టీసీ రీజినల్ చైర్ పర్సన్‌గా బత్తుల సుప్రజా రెడ్డి, డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మన్‌గా రావి పద్మావతి రామనాథం బాబు, జిల్లా లైబ్రరీ చైర్మన్ ఆర్.వెంకట సుశీల, ఒంగోలు అర్బన్ డెవలెప్‌మెంట్ అథారిటీకి చైర్ పర్సన్‌గా శింగరాజు మీనా కుమారి వెంకట్రావు, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా బత్తుల పద్మావతితో పాటు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన కులాల కార్పొరేషన్లకు చైర్మన్లుగా, డైరెక్టర్లుగా మహిళలనే కేటాయించి గుర్తింపు తీసుకొచ్చారు. ఒక్క మాటలో చెప్పాలంటే సగం కాదు మహిళలకు సగంకంటే ఎక్కువ పదవులను ఇచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్.

జిల్లాలో స్థానిక సంస్థల్లో మహిళల ప్రాతినిధ్యం

హోదా	మొత్తం సంఖ్య	మహిళల సంఖ్య
జెడ్పీ చైర్‌పర్సన్	01	01
జెడ్పీ వైస్ చైర్‌పర్సన్‌లు	02	02
జెడ్పీటీసీ సభ్యులు	55	34
మండల పరిషత్ అధ్యక్షులు	53	32
ఎంపీటీసీ సభ్యులు	718	412
మొత్తం గ్రామ పంచాయతీలు	1011	554
గ్రామ పంచాయతీల్లో వార్డులు	10076	5458

తోబుట్టువులా అండగా..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మహిళలకు తోబుట్టువుగా అండగా నిలిచారు. మహిళా సాధికారతకు పెద్ద పీట వేస్తున్నారు. అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్న దృఢ సంకల్పంతో చేయూతనిస్తున్నారు. మహిళలు సాధికారత దిశగా ముందుకు తీసుకుపోవాలన్న లక్ష్యంతో సాగుతున్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేపట్టని సంస్కరణలను తీసుకొచ్చి మహిళలకు భరోసా ఇస్తున్నారు.

– బూచేపల్లి వెంకాయమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్

మహిళల రక్షణకు నిరంతర కృషి



మహిళలు, బాలికల మీద జరుగుతున్న నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాం. గుడ్ ట్రయల్ మానిటరింగ్‌తో నిందితులకు శిక్షలు పడేలా చేస్తున్నాం. అత్యవసర సందర్భాల్లో రక్షణ కోసం దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తున్నాం. దిశా పెట్రోలింగ్ వాహనాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేశాం. గ్రామ, వార్డు స్థాయిలో మహిళా పోలీసుల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి పోలీసు స్టేషన్లో ఉమెన్ హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి బాధిత మహిళలు వచ్చినప్పుడు వెంటనే ఫిర్యాదు నమోదు చేసేలా చర్యలు తీసుకుంటాం. మహిళ పట్ల నేరాలకు పాల్పడే వారి మీద రౌడీ షీట్ ఓపెన్ చేస్తున్నాం.

–మలికా గర్గ్, ఎస్పీ

అన్నింటా ప్రోత్సాహం



సీఎం వైఎస్ జగన్ మహిళలకు రక్షణగా నిలుస్తున్నారు. రాష్ట్రంలో అన్ని పదవుల్లో మహిళలకు 50 నుంచి 60 శాతం వరకు పదవులను ఇచ్చి గౌరవిస్తున్నారు. సామాజికంగా ఆర్థికంగా ఎదగటానికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. పారిశ్రామిక రంగంలోనూ పురుషులతో సమానంగా ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా ప్రోత్సహిస్తున్నారు. కోట్లాది రూపాయలు ఇన్సెంటివ్‌లు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారు.

– గంగాడ సుజాత, ఒంగోలు నగర పాలక సంస్థ మేయర్

మహిళలకే అధిక ప్రాధాన్యత



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చింది. నన్ను ఏపీఎస్ ఆర్టీసీ నెల్లూరు జోన్ చైర్మన్‌గా నియమించి ఆర్టీసీ అభివృద్ధిలో నాకు అవకాశం కల్పించారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు మహిళలకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. దిశ చట్టాన్ని తీసుకుని రావటంతో పాటు దిశ పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసి మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.

– బత్తుల సుప్రజరెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ నెల్లూరు జోన్ చైర్మన్, సింగరాయకొండ

మహిళల సంక్షేమమే లక్ష్యంగా పాలన



మహిళా రిజర్వేషన్‌ను సక్రమంగా అమలు చేస్తూ మహిళల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోంది. మహిళల రిజర్వేషన్ ద్వారానే నాకు జెడ్పీ వైస్ చైర్మన్ గా అరుదైన అవకాశం లభించింది. అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత వంటి పథకాలను మహిళలకే అందిస్తూ మహిళాభివృద్ధికి కృషి చేస్తున్న నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి.

– యన్నాబత్తిన అరుణ, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్

అన్నీ రంగాల్లో మహిళలు మరింత రాణించాలి



మహిళలు ఇప్పటికే విద్య, సామాజిక, ఆర్థిక, రాజకీయ, ప్రసార మాధ్యమ, కళా, సాంస్కృతిక, విజ్ఞాన, సాంకేతిక రంగాల్లో పురుషులకు సమానంగా రాణిస్తున్నారు. మహిళలు హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవాలి. స్వయం నిర్ణయాత్మక శక్తిని పెంపొందించుకోవాలి. బాల్య వివాహాలు నివారించడంలో తల్లులు నడుం బిగించాలి.

– రామిశెట్టి శ్రీలత, జిల్లా రెవెన్యూ అధికారి

మహిళా సాధికారతకు పెద్దపీట



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆయన మహిళా సాధికారితకు రాష్ట్రంలో పెద్ద పీట వేశారు. గత ప్రభుత్వం ఓట్ల కోసం పసుపు కుంకుమ పేరుతో మహిళలను వంచనకు గురిచేసింది. రాష్ట్రంలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ ఇచ్చి మహిళలను చట్టసభల్లోకి తీసుకొచ్చారు.

– రావి పద్మావతి, డీసీఎంఎస్ చైర్మన్

స్త్రీ ఒక శక్తిలా ఎదగాలి



స్త్రీ అన్నీ అంశాల్లో అవగాహన, విజ్ఞానం పెంచుకుని ఒక శక్తిలా ఎదగాలి. మహిళా రక్షణ చట్టాలపై అవగాహనతో ఉంటూ సద్వినియోగం చేసుకోవాలి. ఆరోగ్య సమస్యల పట్ల ముందస్తు జాగ్రత్తతో ఉండాలి. మహిళా సాధికారత సాధించే దిశగా ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోంది. వాటిని సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ ఎస్.మాధురి, అసిస్టెంట్ ఆర్ఎంఓ, జీజీహెచ్

మహిళలకు గౌరవం దక్కుతోంది



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలకు గౌరవం దక్కుతోంది. బాలికలు బాగా చదువుకోవటానికి అవకాశం కల్పించిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుంది. మహిళలు సంఘంలో గౌరవంగా బతకగలుగుతున్నారు. చంద్రబాబునాయుడు డ్వాక్రా గ్రూపు మహిళలకు మాయమాటలు చెప్పి ఓట్లు దండుకున్నారే తప్ప మేలు చేసిందేమీ లేదు.

– రాచగొర్ల సుశీల పిచ్చయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్

సంక్షేమ పథకాల్లోనూ అగ్రతాంబూలం

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లోనూ అతివలకే అగ్రతాంబూలమిస్తున్నారు. ఇళ్ల పట్టాలు కూడా మహిళల పేరుమీదనే ఇచ్చి ఇళ్లు కట్టించే కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ చేపట్టారు. వాటితో పాటు అమ్మ ఒడి, డ్వాక్రా గ్రూపు మహిళలకు బ్యాంకు లింకేజి కింద సున్నా వడ్డీ, సబ్సిడీలు, పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు బ్యాంకు రుణాలు, ఇన్సెంటివ్‌లు, జగనన్న పాల వెల్లువ, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, ఉపాధి కూలీలుగా మహిళలకు ప్రథమ అవకాశం ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో పథకాల్లో మహిళలకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నారు.

ఉపాధి హామీ పథకంలో..

మహిళా కూలీలు: **2,84,393**

సంవత్సరానికి కూలీల రూపంలో రూ.710 కోట్లు మహిళల బ్యాంకు ఖాతాల్లోకి

డ్వాక్రా గ్రూపులు:

డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో **45,436** గ్రూపులు

- ప్రతి గ్రూపులో 10 మంది సభ్యులు
- మొత్తం టర్నోవర్ రూ.**3,054.23**
- పట్టణ ప్రాంతాల్లోని మెప్మా ఆధ్వర్యంలో **8,859** గ్రూపులు
- టర్నోవర్ రూ.**1,786.70** కోట్లు

మన నమ్మకం జగనన్నే...

- మా కుటుంబాలు బాగుపడ్డాయని స్వయంగా వెల్లడించిన స్థానికులు
- ప్రతి ఇంటికి వచ్చిన సంక్షేమ పథకాలు వివరించిన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- 5వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు సబర్బన్: ప్రజలందరి నమ్మకం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి అన్నారు. 5వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం బాలినేని నిర్వహించారు. డివిజన్‌లోని గోపాల్ నగర్ ఎక్స్‌టెన్షన్ గడ్డి కయ్యల ప్రాంతంలో బాలినేని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మహిళలు బాలినేనికి హారతులతో, పూలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏఏ పథకాలు, ఎంతెంత వచ్చాయో స్థానిక మహిళల నుంచి సమాధానాలు రాబట్టారు. చంద్రబాబు హయాంలో డ్వాక్రా మహిళలను, రైతులను ఏ విధంగా మోసం చేసింది స్వయంగా మహిళలు బాలినేనికి వివరించారు. జగనన్న ప్రభుత్వంలో అమ్మ ఒడి మొదలుకొని ప్రతి ఇంటికి వస్తున్న అన్ని రకాల సంక్షేమ పథకాల గురించి వివరించారు. సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాలతోనే తమ కుటుంబాలు పచ్చగా ఉంటూ బాగుపడ్డాయని మహిళలు సంతోషంగా తెలిపారు.

తోపుడు బళ్లు ఇచ్చి ఆదుకున్న బాలినేని...

రెక్కాడితే గానీ డొక్కాడని బడుగు జీవులకు బాలినేని శ్రీనివాస రెడ్డి సొంత డబ్బులతో తోపుడు బళ్లు ఇచ్చి ఆదుకున్నారు. 5వ డివిజన్‌లోని భగత్ సింగ్ నగర్‌లో నివాసం ఉంటున్న మీరాబీ రోడ్డు మీద కూరగాయలు పెట్టుకొని జీవనం సాగిస్తోంది. విషయం తెలుసుకున్న బాలినేని ఆమెకు తోపుడు బండి అందజేశారు. అదేవిధంగా రవి అనే కార్మికుడు కూడా పూలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తాడు. అతని కుటుంబ నేపథ్యం తెలుసుకున్న బాలినేని అతనికి కూడా తోపుడు బండిని అందజేశారు. దీంతో ఆ రెండు కుటుంబాలు తమ సంతోషాన్ని వ్యక్తం చేశాయి. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్య వైశ్య ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాదు, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, కమీషనర్ ఎం.వెంకటేశ్వర రావు, పార్టీ జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, 5వ డివిజన్ కార్పొరేటర్ ఎందేటి పద్మావతి రంగా రావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు అధ్యక్షుడు కఠారి శంకర్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గంటా రామానాయుడు, బీ మురళి, ఒంగోలు ఏఎంసీ చైర్మన్ కే రామచంద్రరావు, మహిళా విభాగం వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ అధ్యక్షురాలు టి.మాధవి, 5వ డివిజన్ అధ్యక్షుడు సీహెచ్.సత్య నారాయణ రెడ్డి, ఆవుల సురేంద్ర, జీ కృష్ణ, ఆర్ శ్రీకాంత్, కఠారి సురేష్, ఎం .సుబ్బులు, గఫూర్, డీఅమ్మన్న, ఎం సుబ్బారావు, ఎం వెంకటేశ్వర్లు, కే.నివాస్ పాల్గొన్నారు.





చిరువ్యాపారులు మీరాబీ, రవికి తోపుడు బండ్లు తన సొంత డబ్బులతో అందజేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి, పక్కన కార్పొరేటర్ ఎందేటి పద్మావతి రంగారావు

ఎన్నికల సంస్కరణలు అమలు చేయాలి

- ఎంపీ బినయ్ విశ్వం



శతజయంతి సభలో ప్రసంగిస్తున్న బినయ్ విశ్వం

ఒంగోలు టౌన్: దేశంలో ఎన్నికల సంస్కరణలు చేయాలని అనేక కమిషన్లు చేసిన సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం బుట్టదాఖలు చేసిందని సీపీఐ పార్లమెంట్ సభ్యుడు బినయ్ విశ్వం అన్నారు. ఒంగోలులోని బచ్చలబాలయ్య కళ్యాణమండపంలో ఆదివారం నిర్వహించిన కమ్యూనిస్టు యోధుడు, మాజీ పార్లమెంటు సభ్యుడు గుజ్జుల యలమందా రెడ్డి శత జయంతి ప్రారంభోత్సవ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని దామాష ఎన్నికల అవశ్యకతపై ప్రసంగించారు. సభకు సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విశ్వావస్ మాట్లాడుతూ... దేశంలో ప్రజాస్వామ్యాన్ని పాలకవర్గాలు నిర్వీర్యం చేస్తున్నాయని అన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఎలాంటి పాత్రలేని ఆర్ఎస్ఎస్, బీజేపీలు..దోపిడీదారులు, కార్పొరేట్లకు అనుకూలంగా చట్టాల్లో సవరణలు చేస్తున్నారని ఆరోపించారు. దేశంలో ఎన్నికల సంస్కరణలను అమలు చేయకపోతే ప్రజలు తీవ్రంగా నష్టపోతారని ప్రముఖ విశ్లేషకుడు పరకాల ప్రభాకర్ చెప్పారు. కేవలం 38 శాతం ఓట్లతో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం దేశ స్వాతంత్ర విలువల్ని దెబ్బతీసేలా మార్పులు తీసుకొస్తుందన్నారు. గుజరాత్, మణిపూర్, హర్యానా లాంటి పరిస్థితులు దేశమంతా ప్రబలే ప్రమాదం ఉందన్నారు. నిరుపేద ప్రజల పన్నుల శాతాన్ని పెంచి సంపన్న వర్గాల పన్నులను తగ్గించడం దారుణమన్నారు. వెలిగొండ ప్రాజెక్టుకు కమ్యూనిస్టు నేత పూల సుబ్బయ్య పేరును పెట్టాలని అడిగిన వెంటనే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అంగీకరించారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. కమ్యూనిస్టులు ఎన్నికల కోసమో, ఆస్తిపాస్తులను పెంచుకునేందుకో ఎర్రజెండా పట్టుకోలేదని, ప్రజలను కష్టాల కడలి నుంచి గట్టెక్కించాలని ఎర్రజెండా పట్టుకున్నారని చెప్పారు. మోదీ ప్రధాని ఆయ్యాక దేశం అప్పులు రూ.155 కోట్లకు పెరిగాయని చెప్పారు.

వైఎస్ రాజశేఖరరెడ్డి బాగా మాట్లాడారు

తాను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి దగ్గరికి వెళితే చాలా బాగా మాట్లాడారని, తాను నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల గురించి ఆరా తీశారని జర్మనీ సెనెట్ సభ్యుడు గుజ్జుల రవీంద్ర చెప్పారు. దేశం విడిచి 50 ఏళ్లయినా తాను తెలుగును మరిచిపోక పోవడానికి మాతృభూమి మీద మమకారమే కారణమన్నారు. దేశంలో రైట్‌వింగ్ రాజకీయాలను ప్రోత్సహించవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెల్లి విల్సన్, ఏ రామమూర్తి, రావుల వెంకయ్య, శివారెడ్డి, గుజ్జుల గాబి తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు వేయాలి

ఒంగోలు టౌన్: మహిళలు పురుషులతో కలిసి పనిచేసేచోట లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు వేయాలని శ్రామిక మహిళా సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. స్థానిక నండూరి ప్రసాదరావు భవనంలో శ్రామిక మహిళ రాష్ట్ర సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పెన్షన్, ప్రసూతి సెలవులను అమలు చేయాలని కోరారు. మహిళలు పనిచోట గౌరవప్రదమైన వాతావరణాన్ని కల్పించడం యాజమాన్యం బాధ్యత అన్నారు. దాన్ని పర్యవేక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని స్పష్టం చేశారు. లైంగిక వేధింపుల నిరోధక చట్టం తీసుకురావడానికి పదేళ్లు పట్టినా నేటికీ చట్టం అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జి.సుజాత, పరిశుద్ధం, సుబ్బమ్మ, పద్మ, రమాదేవి, సీఐటీయూ నాయకుడు జీవి కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శ్రామిక మహిళా సదస్సులో మాట్లాడుతున్న ధనలక్ష్మి

క్లుప్తంగా

పురుగుమందు తాగి యువకుడు ఆత్మహత్య

రాచర్ల: మద్యంలో పురుగు మందు కలుపుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని ఆరవీటికోటలో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఆరవీటికోట గ్రామానికి చెందిన దూదేకుల దస్తగిరి (35) అనే యువకుడు మద్యానికి బానిస కావడంతో ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగాడు. సంఘటన స్థలంలో పడి ఉన్న దస్తగిరిని గమనించిన స్థానికులు వెంటనే 108 వాహనంలో గిద్దలూరు ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మధ్యాహ్నం 12 గంటల సమయంలో మృతి చెందాడు. దస్తగిరికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్సై. జి.కృష్ణపావని తెలిపారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసం

కనిగిరి రూరల్: ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసం చేశారని ఒక బాధితుడు ఆదివారం ఎస్సైకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన వ్యక్తి గుంటూరులోని ఓ ఏజెన్సీ ద్వారా కోర్టులో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ కనిగిరి పట్టణంతో పాటు, మరి కొందరి దగ్గర నగదు వసూలు చేసినట్లు తెలిసింది. ఈక్రమంలో కనిగిరికి చెందిన బాలాజీ అనే యువకుడు సుమారు రూ.2 లక్షలకు ఇవ్వగా, అతనికి గుంటూరు ఏజెన్సీ ద్వారా ఒక ఉద్యోగ ఆర్డర్ ఇచ్చారు. అది చెల్లుబాటు కాలేదు. బాధితుడు సుమారు ఏడాదిన్నర నుంచి తిరుగుతున్నా నగదు తిరిగి ఇవ్వలేదు. ఈ మేరకు ఎస్సై దాసరి ప్రసాద్‌ను 'సాక్షి' అడగ్గా కనిగిరి ఎంపీపీ సమక్షంలో ఉద్యోగం కోసం ఒక వ్యక్తికి డబ్బులు ఇచ్చినట్లు ఒక యువకుడు మాత్రమే స్పందనలో ఫిర్యాదు చేశాడన్నారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి కేసు నమోదు చేస్తామన్నారు. దీనిపై ఎంపీపీ ప్రకాశంను అడగ్గా.. బాధితులతో పాటు తాను కూడా ఒక వ్యక్తికి నగదు ఇచ్చానని వెల్లడించారు. గుంటూరుకు చెందిన ఏజెన్సీ వ్యక్తులు ఇచ్చిన ఆర్డర్ కాపీలు చెల్లుబాటు కాలేదన్నారు. డబ్బులు తిరిగి ఇవ్వలేదని వాపోయారు.

17న కౌన్సెలింగ్

ఒంగోలు: జిల్లాలోని ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, అకౌంటెంట్లు, మెసెంజర్లు, సీఆర్‌ఎంటీల పరస్పర, అభ్యర్థన బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 17న స్థానిక సమగ్రశిక్ష కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ప్రాజెక్టు కో ఆర్డినేటర్ వీఎస్ సుబ్బారావు ఆదివారం తెలిపారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా...

అభివృద్ధే ధ్యేయంగా..


ఓ ఇంటి వద్ద ఎమ్మెల్యేకు హారతి ఇస్తున్న మహిళ(ఫైల్)


గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి(ఫైల్)

- నేడు మార్కాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం 200వ రోజు
- 70 సచివాలయాలకు రూ.14 కోట్లు విడుదల
- 70 వేల కుటుంబాలను కలుసుకున్న ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం: సమస్యల పరిష్కారమే లక్ష్యంగా.. అభివృద్ధే ధ్యేయంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అప్రతిహతంగా సాగుతోంది. మార్కాపురం నియోజకవర్గంలో సోమవారం 200వ రోజు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు పట్టణంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. మార్కాపురం పట్టణం, రూరల్, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాల్లోని ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో ఏడాదికి పైగా సాగుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 70 సచివాలయాల పరిధిలో 70 వేల కుటుంబాలను ఎమ్మెల్యే కలుసుకున్నారు. సుమారు 70 శాతం వ్యక్తిగత సమస్యలను పరిష్కరించారు. ఒక్కో సచివాలయానికి ప్రభుత్వం రూ.20 లక్షల రూపాయలు విడుదల చేసింది. గడప గడపకు మన ప్రభుత్వం పూర్తయిన వెంటనే నిధులు అందజేస్తున్నారు. ఇంటింటికీ వెళ్తున్న ఎమ్మెల్యేకు ప్రజలు ఘన స్వాగతం పలుకుతున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో తాము ఏ విధంగా లబ్ధి పొందామో వివరిస్తున్నారు. ఇదే సమయంలో రేషన్‌కార్డుల మంజూరు, పింఛన్ల పునరుద్ధరణ, వివిధ రకాల సర్టిఫికెట్ల మంజూరుపై వచ్చిన వినతులపై అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపుతున్నారు.

సచివాలయ ఫండ్స్‌తో చేపట్టే పనులు

ఒక్కో సచివాలయానికి 20 లక్షల చొప్పున నిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందజేస్తోంది. ఈ నిధులతో ప్రధానంగా చప్టాలు, కల్వర్టులు, నీటి సౌకర్యం, ఎలక్ట్రిక్ వర్కులు, సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపడుతున్నారు. మార్కాపురం నియోజకవర్గంలో ఇప్పటివరకు 70 సచివాలయాల పరిధిలో గడప గడపకు.. పూర్తి కాగా రూ.14 కోట్ల రూపాయల నిధులు విడుదల చేసి పనులు చేపట్టారు. మార్కాపురం మండలంలోని వేములకోట, రాయవరం, నికరంపల్లి, నాగులవరం, గజ్జలకొండ తదితర పంచాయితీల్లో అభివృద్ధి పనులు సాగుతున్నాయి.

నేడు మార్కాపురంలో గడప గడపకు..

మార్కాపురం పట్టణంలోని 17వ వార్డు పరిధిలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి సోమవారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో 200వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ వైస్ చైర్మన్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఇస్మాయిల్ తెలిపారు. భారీ ఎత్తున నిర్వహిస్తున్న కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జగన్ ప్రభుత్వంలో రూ.9.80 లక్షల లబ్ధి



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాకు వివిధ పథకాల కింద ఇప్పటి వరకు 9.80 లక్షల రూపాయల లబ్ధి చేకూరింది. ప్రతి నెలా పింఛను, ఆసరా ఇలాంటి పథకాలన్నీ ఎటువంటి సిఫార్సు లేకుండానే మాకొచ్చాయి. చాలా సంతోషంగా ఉంది.

– ఎ కొండమ్మ, బాపూజీ కాలనీ

మార్కాపురంలో రూ.1.30 కోట్లతో పనులు పూర్తి



మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలో దాదాపు 18 సచివాలయాల్లో గడప గడపకు మన ప్రభుత్వం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో పూర్తిచేశాం. రూ.4.30 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపాం. ఆమోదం రాగానే పనులు ప్రారంభిస్తాం. పట్టణంలో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాం.

– బాలమురళీకృష్ణ, మార్కాపురం మున్సిపల్ చైర్మన్

ప్రజల ఆదరణ మరిచిపోలేను

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో నేను ఎమ్మెల్యేగా ఉండటం అదృష్టంగా భావిస్తున్నా. గడచిన నాలుగేళ్ల కాలంలో మార్కాపురం నియోజకవర్గంలో రూ.1500 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు మంజూరు చేశారు. ఇందులో ప్రధానంగా మెడికల్ కళాశాల, పొదిలి పెద్దచెరువుకు సాగర్‌నీటి సరఫరా, మార్కాపురంలో మిగిలిన వార్డులకు సాగర్ పైపులైన్లు, షాదీఖానా మంజూరు, గొట్టిపడియ దగ్గర ఇన్‌టెక్ వెల్ పనులన్నీ కూడా సీఎం వైఎస్ జగన్ మంజూరు చేసినవే. గడప గడపలో నేను ప్రతి ఇంటికీ వెళ్తున్నప్పుడు సీఎంతోపాటు నాపై చూపుతున్న ఆదరణ, అభిమానాన్ని ఎన్నటికీ మరిచిపోను. ఇప్పటి వరకు 70 వేల కుటుంబాలను కలిశా. రూ.14 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు సాగుతున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం వల్ల ప్రజలను నేరుగా కలిసి, వారి సమస్యలు విని పరిష్కరించే అవకాశం కలిగింది.

– కేపీ నాగార్జునరెడ్డి, ఎమ్మెల్యే మార్కాపురం

రివార్డులు ఉత్తిదే.. నమ్మొద్దు

- ప్రజలకు ఎస్పీ మలికా గర్గ్ సూచన


ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: ఇది డిజిటల్ కాలం.. లావాదేవీలు సైతం చేతిలో సెల్‌ఫోన్‌తోనే చేయడం అందరికీ అలవాటైపోయింది. దీన్ని ఆసరాగా చేసుకుని కొందరు సైబర్ నేరగాళ్లు యథేచ్ఛగా మోసాలకు పాల్పడుతున్నారు. కళ్లు మూసి తెరిచేలోపే బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. అందుకే అప్రమత్తత అవసరం అంటున్నారు ఎస్పీ మలికా గర్గ్. ఫోన్ పే, గూగుల్ పే రివార్డ్స్ పేరుతో జరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలు జాగ్రతగా ఉండాలని చెబుతున్నారు. సైబర్ నేరాలు జరుగుతున్న విధానాలను వివరించి, తగిన జాగ్రతలను సూచించారు. ఇటీవల కాలంలో రివార్డ్స్ మోసాలు ఎక్కువయ్యాని, గూగుల్ పే నుంచి మాట్లాడుతున్నామంటూ ఫోన్ చేస్తున్న సైబర్ నేరగాళ్లు ‘మీ ఫోన్ పేలో రివార్డు డబ్బును క్లెయిమ్ చేసుకోలేదు, లేదంటే అది క్యాన్సిల్ అవుతుంది’ అని నమ్మబలుకుతున్నారని వివరించారు. రివార్డు డబ్బులను పొందేందుకు వెంటనే యాప్ ఓపెన్ చేయాల్సిందిగా చెప్పి అందులో పే రిక్వెస్ట్ పంపిస్తారని తెలిపారు. డబ్బును అకౌంట్‌లో జమ చేయడానికి యూపీఐ పిన్ నంబరు చెప్పాలని అడుగుతారని, పిన్ నంబర్ చెప్పగానే మీ ఖాతా నుంచి డబ్బులు మాయమవుతాయని చెప్పారు.

ఈ జాగ్రతలు తీసుకోండి..

- తొలుత మీరు బదిలీ చేసిన డబ్బు తాలుకూ ఏదైనా రివార్డులు వచ్చాయో లేదో మీ ఫోన్లో చెక్ చేసుకోండి.
- ఫోన్ పే, గూగుల్ పే కంపెనీల ప్రతినిధులు ఎవరికీ ఫోన్ చేయరన్న సంగతి గ్రహించండి.
- మీరు డబ్బును బదిలీ చేసే సమయంలో వచ్చిన నోటిఫికేషన్ పే రిక్వెస్ట్ లేదా రిసీవ్ రిక్వెస్ట్‌కు సంబంధించినదా లేదా అనేది చెక్ చేసుకోవాలి.
- ఒకవేళ పే రిక్వెస్ట్ అని ఉంటే వెంటనే యాప్‌ను ఆఫ్ చేయండి.
- ఎవరైనా ఈ విధంగా మోసపోయినట్లయితే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు. సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫోన్ చేయాలని సూచించారు.

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం


సంక్షేమ బుక్‌లెట్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

కంభం: ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. మండలంలోని జంగంగుంట్లలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యేకు నాయకులు, గ్రామస్తులు, మహిళలు ఘనస్వాగతం పలికారు. భారీ గజమాలను క్రేన్ సహాయంతో సత్కరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన ప్రతిఒక్క హామీని నెరవేర్చారన్నారు. రాష్ట్రంలో మహిళలకు అండగా ఉండి అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. జగనన్న ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారని, సంక్షేమ పథకాల కోసం నాయకుల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా అర్హతే ప్రామాణికంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాలను, ఆ గడపకు అందిన మేలును వివరించారు. రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. బీసీకాలనీలో పూర్తిస్థాయిలో సీసీరోడ్లు నిర్మిస్తామన్నారు. మంచి నీటిబోరును మంజూరు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి, జెడ్పీటీసీ కొత్తపల్లి జ్యోతి, ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్‌వలి, మాజీ ఏఎంసీ చైర్మన్ నెమిలిదిన్నె చెన్నారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సయ్యద్ జాకీర్ హుస్సేన్, జెసీఎస్ కన్వీనర్ డిష్ మున్నా, సర్పంచ్‌లు సుజాత, పల్నాటి బోడయ్య, బత్తుల తిరుపాలమ్మ, రసూల్, మహబూబ్‌పీరా, నాయకులు సుబ్బారెడ్డి, హరిబాబు, మాజీ సర్పంచ్ జ్యోతి, కొత్తపల్లి శ్రీను, శరభారెడ్డి, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

బాలినేనికి రుణపడి ఉంటాం

- ఏడు దశాబ్దాలుగా ఒగ్గులకుంట సమస్య
- హామీ మేరకు సమస్య పరిష్కరించిన బాలినేనికి కృతజ్ఞతలు
- రజకాభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్ మోహన్‌రావు


మాట్లాడుతున్న రజకాభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్ మోహన్‌రావు

ఒంగోలు: మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వల్లే ఒగ్గుల కుంట సమస్యకు పరిష్కారం లభించిందని రజకాభివృద్ధి సంస్థ చైర్మన్ మోహన్‌రావు పేర్కొన్నారు. రజకాభివృద్ధి సంస్థ తరఫున బాలినేనికి కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం స్థానిక ఒగ్గులకుంటలో రజకాభివృద్ధి సంస్థ జిల్లా, నగర కమిటీ ఎంపికకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఒంగోలుకు చెందిన మారెళ్ల శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒగ్గులకుంట సమస్య గత ఏడు దశాబ్దాలుగా ఉందన్నారు. ఎంత మంది ఎన్ని అడ్డంకులు సృష్టించినా రజకులకు ఇచ్చిన హామీ మేరకు సమస్యను పరిష్కరించిన బాలినేని శ్రీనివాసరెడ్డికి రుణపడి ఉంటామన్నారు. దాతలు ఇచ్చిన డబ్బుతో ఇప్పటికే ప్రహరీ నిర్మించామని, ఇకపై రజకాభివృద్ధి సంస్థ కార్యక్రమాలన్నీ ఇదే ఆవరణ నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కమ్మన, గుర్రం సుబ్బన్న, పాదర్తి అంజనేయులు, వెంకటేశ్వర్లు, మాటూరి వెంకటేశ్వర్లు, బొప్పరాజు జ్యోతి, స్వర్ణ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆరు పొగాకు బేళ్లు అపహరణ

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి సమీపంలో ఐటీసీ కంపెనీ నిల్వ ఉంచిన పొగాకు బేళ్లు అపహరణకు గురయ్యాయి. వివరాల్లోకి వెళితే..వేలంలో కొనుగోలు చేసిన పొగాకు బేళ్లను నిల్వ ఉంచేందుకు ఐటీసీ సువర్ణ కాటన్ జిన్నింగ్ మిల్స్‌ను అద్దెకు తీసుకుంది. ఈ క్రమంలో అందులో ఉంచిన 6 పొగాకు బేళ్లు అపహరణకు గురైనట్లు కంపెనీ మేనేజర్ గంగిశెట్టి రామసాయి మద్దిపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మద్దిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ గ్రావెల్ తవ్వకంపై మైనింగ్ అధికారుల దాడి

- శానంపూడి పరిధిలో జేసీబీ, టిప్పర్ సీజ్


పోలీస్‌స్టేషన్‌లో సీజ్ చేసిన జేసీబీ

సింగరాయకొండ: మండలంలోని శానంపూడి పంచాయతీ పరిధిలో ప్రభుత్వ భూముల్లో రాత్రిపూట అక్రమంగా గ్రావెల్ తవ్వి రవాణా చేస్తుండగా మైనింగ్ శాఖ జిల్లా విజిలెన్స్ స్పెషల్ స్క్వాడ్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.ఈరేష్ తన సిబ్బందితో కలిసి శనివారం రాత్రి దాడి చేశారు. పాత సింగరాయకొండ పంచాయతీ గవదగట్లవారిపాలేనికి చెందిన డి.శేషయ్యకు చెందిన టిప్పర్, జేసీబీని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రెండు వాహనాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై శ్రీరామ్‌కు అప్పగించారు. ప్రభుత్వ భూమిలో ఏ మేరకు అక్రమ తవ్వకాలు జరిపారో సోమవారం సర్వేయర్‌తో కలిసి పరిశీలించి జరిమానా విధిస్తామని మైనింగ్ శాఖ అధికారులు పేర్కొన్నారు.

రైస్‌మిల్లు ఆపరేటర్ దారుణ హత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సైలు

ఆత్మకూరు: పట్టణంలోని తూర్పువీధిలో రైస్‌మిల్లు ఆపరేటర్ దేవరింటి సత్యం (47) దారుణ హత్యకు గురయ్యాడు. శనివారం అర్ధరాత్రి జరిగిన హత్య ఉదంతం ఆదివారం తెల్లవారుజామున వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణం అరవపాళెం దళితకాలనీకి చెందిన దేవరింటి సత్యం పదేళ్ల క్రితం ఆత్మకూరులోని ఓ రైస్ మిల్లులో ఆపరేటర్ (డ్రైవర్)గా చేరాడు. భార్య దేవితో కలిసి మిల్లు సమీపంలో ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. ఈ నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి ఆరుబయట నిద్రిస్తున్న తన భర్తను గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో పొడిచారని భార్య దేవి అతన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లింది. వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న ఎస్సై ముత్యాలరావు తన సిబ్బందితో ఆస్పత్రికి చేరుకొని విచారించారు. అనంతరం సీఐ వేణుతో కలిసి హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఆత్మకూరు డీఎస్పీ ఎస్.కోటారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం క్లూస్ టీం, పోలీసు జాగిలం ద్వారా హత్య జరిగిన స్థలం పరిసరాలను పరిశీలించారు. పూర్తిస్థాయి విచారణ జరిపి నిందితులను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. మృతదేహానికి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

జనసేనలో రచ్చకెక్కిన విభేదాలు

- ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసిన పోలీసులు
- సయోధ్యకు పార్టీ పెద్దలు చేసిన ప్రయత్నాలు విఫలం


పోలీస్ స్టేషన్‌వద్ద గుమిగూడిన జనసేన కార్యకర్తలు


దాడిలో చొక్కా చినిగిన పెంట్యాల కోటి

నాగులుప్పలపాడు: జనసేన పార్టీలో విభేదాలు రచ్చకెక్కాయి. ఈనెల 10న జనసేన పార్టీకి చెందిన కార్యకర్త తోట అంజి సోషల్ మీడియా గ్రూప్‌లో చిరంజీవి జన్మదినానికి సంబంధించిన పోస్ట్ పెట్టాడు. ఏకపక్ష నిర్ణయంతో పోస్టులు పంపడమేంటి, మండల పార్టీ నాయకులు మాట్లాడి నిర్ణయం తీసుకోవాల్సి ఉందని సూచించడంతో తోట అంజి, మండల జనసేన ఉపాధ్యక్షుడు కొనిజేటి ధనుష్ వర్గీయుల మధ్య వివాదం మొదలైంది. మరుసటి రోజు బుధవారం నాగులుప్పలపాడులో రెండు వర్గాలు మాట్లాడుకుందామని సమావేశమై ఒక్కసారిగా దాడి చేసుకున్నారు. దీంతో కొనిజేటి ధనుష్ ఒంగోలు రిమ్స్‌లో చికిత్స నిమిత్తం చేరి తోటి అంజి, అతని వర్గీయులపై ఔట్‌పోస్ట్‌లో ఫిర్యాదు చేశారు. నాగులుప్పలపాడు పోలీస్ స్టేషన్‌లో కొనిజేటి ధనుష్ వర్గీయులపై తోటి అంజి అతని వర్గీయులు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాల మధ్య సయోధ్య కుదిర్చేందుకు ఆదివారం ఒంగోలులోని జనసేన కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రియాజ్ ప్రయత్నిస్తుండగా మరోసారి వివాదం చెలరేగింది. మండల పార్టీ అధ్యక్షులు భూపతి మురళి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంట్యాల కోటేశ్వరరావు వర్గీయులు పరస్పరం దాడి చేసుకున్నారు. ఈ దాడిలో పెంట్యాల కోటేశ్వరరావు చొక్కా చినిగింది. అనంతరం ఇరువర్గాలు నాగులుప్పలపాడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసేందుకు వస్తుండగా దారి మధ్యలో చదలవాడ వద్ద మరోసారి ఇరువర్గాలు కవ్వించుకున్నాయి. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు చదలవాడ చేరుకుని ఇరువర్గాలను స్టేషన్‌కు తరలించారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెదపూడి విజయకుమార్, జిల్లా అధ్యక్షుడు రియాజ్ నాగులుప్పలపాడు స్టేషన్‌కు వచ్చి ఇరువర్గాల వారిని బుజ్జగించే ప్రయత్నాలు చేశారు. అందుకు వారు ససేమిరా అంటూ ఎవరిదారిన వారు వెళ్లారు. కాగా పదో తేదీన జరిగిన గొడవకు సంబంధించి ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్సై యు.హరిబాబు తెలిపారు.

నూర్‌బాషా సంఘ జిల్లా అధ్యక్షుడిగా పెద్ద మస్తాన్


నియామకపత్రం అందుకుంటున్న పెద్ద మస్తాన్

తర్లుపాడు: నూర్‌బాషా(దూదేకుల) సంఘ ప్రకాశం జిల్లా అధ్యక్షుడిగా కేతగుడిపి సర్పంచ్(సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు) డి.పెద్ద మస్తాన్ నియమితులయ్యారు. ఆదివారం విజయవాడలో నిర్వహించిన సంఘ రాష్ట్ర కమిటీ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు పీర్ మొహమ్మద్ చేతులమీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనార్టీల్లో అంతర్భాగమైన నూర్‌బాషాలకు హిందూ దూదేకులుగా సర్టిఫికెట్లు ఇస్తుండటంతో రిజర్వేషన్ కోల్పోతున్నారని, ఈ సమస్యను రాష్ట్ర సంఘ నాయకత్వంతో కలిసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. షాదీతోఫాను రూ.50 వేల నుంచి రూ.లక్షకు పెంచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన ముస్లిం మోర్చా అధ్యక్షుడు షేక్ బాజీ, ఏలూరు నగర మేయర్ నూర్జహాన్ పెదబాబు, నూర్‌బాషా ఫెడరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ బాబు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుబానీ, జిల్లా సంఘ నాయకుడు అజీజ్, దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ ఖాశింపీరా తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.